సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 27 । జూన్ । 2024



విద్యార్థి సంఘాల ఆందోళన ఉద్రిక్తం
నీట్ పేపర్ లీక్ బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసం వద్ద ఆందోళన చేపట్టారు. 8లో



'కుంటాల' అభివృద్ధికి కృషి
కుంటాల జలపాతం అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతాన్ని సందర్శించారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
32.0/26.0
వాతావరణం
నైరుతి ప్రభావం కారణంగా పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

బిల్లులు ఇప్పించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

ఇచ్చోడ: గ్రామ పంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే ఇప్పించేలా చూడాలని ఇచ్చోడ మండల మాజీ సర్పంచులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షిషాను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే 15నెలల వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నట్లు వారు తెలిపారు.

డీసెట్ దరఖాస్తు గడువు పెంపు

ఆదిలాబాద్‌టౌన్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీసెట్) 2024 పరీక్షకు సంబంధించి దరఖాస్తు, ఎడిట్ ఆప్షన్ గడువును ప్రభుత్వం ఈనెల 30 వరకు పొడిగించినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ పరీక్ష జూలై 10న ఉంటుందని పేర్కొన్నారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పోటీలు



పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించి స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో విద్యార్థులకు జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందిన వారికి చదువుతోపాటు క్రీడల్లో తర్ఫీదు ఇస్తారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు స్వామి, హరిచరణ్, రాజేశ్, కాంతారావు, జూడో కోచ్ రాజు, కబీర్ దాస్ తదితరులున్నారు.

ఫీజుల దోపిడీని నియంత్రించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాలల బంద్‌కు ముందుగానే పిలుపునిచ్చారు. అయితే ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనగా, తెరిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురిచేస్తున్నాయని అన్నారు. ఫీజులు, పాఠ్య పుస్తకాల పేరిట అందినకాడికి దండుకుంటున్నారని పేర్కొన్నారు. ఇష్టారీతిన వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు సరిగా లేవని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, నిఖిల్, శివసాయి, విఘ్నేష్, కార్తీక్, సర్వజీత్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్యం'

బేల: విద్యారంగ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ పిలుపు మేరకు మండలకేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బుధవారం బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్‌ఎంఈవో పోస్టులతో పాటు మెగా డీఎస్సీతో 24వేల ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్‌రెడ్డి, కృష్ణ, ప్రీతం, సాయి, రాజు, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిలర్లు (ఫైల్)

అవిశ్వాసం.. రసకందాయం!

- మున్సిపల్ వైస్‌చైర్మన్‌పై పలువురు తీర్మానం
- వీగేలా కాంగ్రెస్ యత్నాలు
- 'ఎక్స్‌అఫీషియో' ఓటుకు ఎమ్మెల్యే దరఖాస్తు
- ఎంపీకి కూడా ఇచ్చే అవకాశం అన్న చర్చ
- ఆసక్తి కలిగిస్తున్న బల్దియా రాజకీయం

సాక్షి,ఆదిలాబాద్: బల్దియా రాజకీయం రసకందాయంగా మారింది. బీఆర్‌ఎస్ నుంచి అధికార కాంగ్రెస్‌లో చేరిన మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానీని గద్దె దించేందుకు గులాబీ, కమలం పార్టీలతో పాటు స్వతంత్ర కౌన్సిలర్లు సంతకాలు చేసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఇవ్వాలని ఆ కౌన్సిలర్లు కలెక్టర్ రాజర్షిషాకు కాపీ అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ నిర్ణయంపై అందరిలో ఆసక్తి నెలకొంది. సాధారణంగా తీర్మానం అందజేసిన తర్వాత నెలలోపు అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు గడువు ఉంటుందని మున్సిపల్ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇప్పటికే వారం రోజులు గడిచాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఎప్పుడైనా దీనికి తేదీ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని మున్సిపాలిటీ యంత్రాంగం అభిప్రాయ పడుతుంది.

వైస్‌చైర్మన్ పదవి ఎవరికి దక్కేనో..

ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 49 వార్డులు ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 24, బీజేపీ 11, కాంగ్రెస్ 5, ఎంఐఎం 5, స్వతంత్ర అభ్యర్థులు 4 మంది కౌన్సిలర్లుగా గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, తర్వాత ఆయా కౌన్సిలర్లు పార్టీలు మారారు. అంతకుముందే స్వతంత్ర కౌన్సిలర్లు కూడా వివిధ పార్టీల గట్టున చేరారు. బీఆర్‌ఎస్‌కు ఇప్పటికీ 24, బీజేపీకి 9, కాంగ్రెస్‌కు 13, ఎంఐఎంకు ముగ్గురి బలం ఉంది. మొత్తం కౌన్సిలర్ల సంఖ్యపై 2/3వ వంతు అంటే.. 33 మంది అవిశ్వాస తీర్మానం నెగ్గాలన్నా, వీగాలన్నా నిరూపించుకోవాల్సి వస్తుంది. బీఆర్‌ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీజేపీకి చెందిన 46వ వార్డు కౌన్సిలర్ మధు జైస్వాల్ తీర్మానం కాపీలో సంతకాలు చేయలేదు. ఇదిలా ఉంటే స్వతంత్ర కౌన్సిలర్‌గా గెలిచిన 31వ వార్డు కౌన్సిలర్ సల్మా భర్త రషీద్ ఇదివరకు కాంగ్రెస్‌లో చేరారు. కాగా ఈ కౌన్సిలర్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్‌గా తెరపైకి తీసుకొచ్చి జహీర్ రంజానీని గద్దె దించాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ రషీద్ తీర్మానం కాపీలో సంతకం పెట్టడం జరిగింది. కాగా అతడిని కాంగ్రెస్ నుంచి దూరం పెట్టే యోచనలో ఉన్నట్లు చర్చ సాగుతుంది. తద్వారా హస్తం పార్టీకి మరో ఓటు సంఖ్య కూడా తగ్గుతుంది. ఎంఐఎంలో ప్రస్తుతం ముగ్గురు కౌన్సిలర్లు ఉన్నారు. వారు కాంగ్రెస్‌కే మద్దతు ఇస్తారనే ప్రచారం సాగుతుంది. ప్రధానంగా అవిశ్వాస తీర్మానంలో బీఆర్‌ఎస్, బీజేపీల కౌన్సిలర్లు ఉండడంతో దాన్ని విభేదిస్తున్న ఎంఐఎం అందుకు అనుగుణంగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు అంటున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్న మరికొంత మంది కూడా వైస్ చైర్మన్ పదవిపై గురిపెట్టినట్లు తెలుస్తోంది. అందులో షహెనాజ్ బేగం, బండారి సతీశ్, వి.ప్రకాష్ ఉన్నట్లు పార్టీలో చర్చ సాగుతుంది. మొత్తంగా ఈ పరిణామాలన్నీ బల్దియా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

ఎక్స్‌అఫీషియో ఓట్లు కూడా..

ఇప్పటికే 33 మంది సంతకాలు చేయగా, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బీజేపీ కౌన్సిలర్ మధు జైస్వాల్‌లు జత కలిస్తే ఈ సంఖ్య 35కు చేరుకుంటుంది. అంతే కాకుండా ఎక్స్‌అఫీషియో హోదాలో ఓటు వేసేందుకు ఇప్పటికే బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దరఖాస్తు చేసుకున్నాడు. ఎంపీ నగేశ్ కూడా దరఖాస్తు చేసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం ఓట్ల సంఖ్య 51కి చేరుకోగా, అందులో 2/3వ వంతుగా 34 మంది బల నిరూపణకు ఓట్లు వేయాలి. కాగా అవిశ్వాసం వీగేలా కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అది ఎంతవరకు సక్సెస్ అవుతుందనేది చూడాల్సిందే.



మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ

ఆ తేదీని కలెక్టర్ నిర్ణయిస్తారు..

మున్సిపల్ వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి తేదీని కలెక్టర్ నిర్ణయిస్తారు. దానికి అనుగుణంగా ముందుకెళ్తాం. ఎక్స్ అఫీషియో హోదాలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు.
– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

మహిళా శక్తి క్యాంటీన్లు



- జిల్లాలో నాలుగు చోట్ల ఏర్పాటుకు కసరత్తు
- 50 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఎంపిక

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులుగా చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా చిన్నపాటి వ్యాపారాలు చేసుకునేందుకు విరివిగా రుణాలు అందజేస్తున్న ప్రభుత్వం వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసే దిశగా చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. వీటి నిర్వహణ కోసం ఆసక్తి గల 50 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులను ఎంపిక చేసి, వారికి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు.

మహిళా సాధికారత దిశగా..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్షాధికారులను చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అందుకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఇప్పటికే ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టించే బాధ్యతలు అప్పగించారు. తాజాగా వారితో మహిళా క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటి ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ రాజర్షి షా శనివారం సమీక్ష నిర్వహించారు. కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు డీఆర్డీఏ అధికారులు వీటి ఏర్పాటు ప్రక్రియలో నిమగ్నమయ్యారు.

జిల్లాలో నాలుగు క్యాంటీన్ల ఏర్పాటు

ప్రభుత్వ కార్యాలయ సముదాయాలు, ఆలయాలు, మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులాలు, జనసంచారం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో రూ.80లక్షల వ్యయంతో నాలుగు క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు అందుకు అవసరమైన స్థలాలను సైతం గుర్తించారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి, కలెక్టరేట్, రైల్వే స్టేషన్‌తో పాటు బోథ్ మండలం పొచ్చెర జలపాతం వద్ద ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. క్యాంటీన్ విస్తీర్ణంకు అనుగుణంగా ఒక్కోదాంట్లో ఐదు నుంచి 20 మంది సభ్యులు పనిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆసక్తి, కష్టపడే తత్వం కలిగిన 50 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను ఎంపిక చేశారు. క్యాంటీన్ల నిర్వహణపై వీరికి హైదరాబాద్ గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో వారం పాటు శిక్షణ అందించనున్నారు. ఎంపిక చేసిన సభ్యులను అక్కడకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థలం పరిశీలించిన డీఆర్డీవో..

బోథ్: మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా క్యాంటీన్ ఏర్పాటు కోసం డీఆర్డీవో సాయన్న బుధవారం మండలంలోని పొచ్చెర జలపాతం వద్ద స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట టూరిజం అధికారి రవికుమార్, డీపీఎం గంగన్న, ఏపీఎం మాధవ్ ఉన్నారు.

కార్పొరేట్ స్థాయిలో క్యాంటీన్లు



జిల్లాలో నాలుగు మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వాటి ఏర్పాటు కోసం స్థలాలను గుర్తించాం. ఒక్కోటి రూ.15 లక్షల నుంచి రూ.25లక్షల చొప్పున ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం. వీటి నిర్వహణ కోసం 50 మంది మహిళా గ్రూపుల సభ్యులను ఎంపిక చేసి, హైదరాబాద్‌లో వారం పాటు శిక్షణకు పంపిస్తున్నాం. ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎస్‌హెచ్‌జీలకు ఇది వరంలాంటిది. దీన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలి. శిక్షణ అనంతరం వారం రోజుల్లో క్యాంటీన్ల ను ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం.
– సాయన్న, డీఆర్డీవో

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం

- ఎస్పీ గౌస్ ఆలం
- జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ

ఆదిలాబాద్‌టౌన్: మత్తు పదార్థాలు యువత భవితను నాశనం చేస్తాయని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి రహిత సమాజానికి ప్రతిఒక్క రూ కృషి చేయాలన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి చైతన్యపరుస్తామన్నారు. గంజాయి సాగు, రవాణా చేసేవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని డీఅడిక్షన్ సెంటర్ ద్వారా బాగుపర్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు జీవన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద, సీఐలు, రిజర్వు సిబ్బంది, సఖీ కేంద్రం సిబ్బంది, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

డీఎడిక్షన్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ

అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవం పురస్కరించుకొని ఎస్పీ గౌస్ ఆలం బుధవారం జిల్లా కేంద్రంలోని డావ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఎడిక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. నిర్వాహకుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన సేవలు అందించాలని వారికి సూచించారు. ఆయన వెంట డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్, జీపీ కార్మికుల ధర్నా

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి వారి కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. అలాగే మున్సిపల్ కార్మికుల ఈఎస్ఐ రూ.1.36కోట్ల డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, చిన్నన్న, నగేష్, సోనేరావ్, వెంకట్రావు, రామక్క, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అమాత్య ఆశలు!

- ఆశల పల్లకిలో ఎమ్మెల్యేలు
- పోటీలో పీఎస్సార్, వినోద్
- తమకే దక్కేలా లాబీయింగ్
- కేబినెట్‌లో చోటుపై వీడని ఉత్కంఠ



గడ్డం వినోద్



పీఎస్సార్



గడ్డం వివేక్



వెడ్మ బొజ్జు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను మంత్రి పదవి ఊరిస్తోంది. త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ రెండో విడత జరగబోతుందనే ప్రచారం నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. తొలి విడత కూర్పులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎవరికీ చోటు దక్కలేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క వ్యవహరిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు పర్యాయాలు ఇక్కడి నేతలకు అవకాశం దక్కింది. అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న మంత్రులుగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల్లో ఎవరిని అమాత్య పదవి వరిస్తుందోనని రాజకీయ వర్గాలతోపాటు సామాన్యుల్లోనూ ఆతృత నెలకొంది.

పీఎస్సార్‌కు ఖాయమేనా?

తొలి విడతలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)కు బెర్త్ ఖాయమని ఆయన అనుచరులు ఆశలు పెంచుకున్నారు. అదే సమయంలో పోటీలో ఉన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఆయన సోదరుడు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సైతం ఢిల్లీ స్థాయి పరిచయాలతో ఇరువురిలో ఒకరికి పదవి వస్తుందనే నమ్మకంతో ఉన్నారు. అయితే ఎవరికీ చోటు దక్కలేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యే వివేక్ తనయుడు వంశీకృష్ణకు పెద్దపల్లి ఎంపీగా టికెట్ ఇవ్వగా ఆయన గెలిచారు. ఈ క్రమంలో మంత్రి పదవి రేస్ నుంచి వివేక్ పక్కకు వెళ్లినట్లుగానే పార్టీలో కార్యకర్తలు భావిస్తున్నారు. ఒకే కుటుంబానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందనే కోణంలో వివేక్‌కు అవకాశాలు తగ్గాయి. ఇక సీనియర్లలో వినోద్, పీఎస్సార్ ఉండగా, ఖానాపూర్ నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఉన్నారు. పార్టీ కష్టకాలం నుంచి అధికారంలోకి వచ్చేదాకా ఉమ్మడి జిల్లాలో బలోపేతం చేసిన నాయకుడిగా పీఎస్సార్‌కు పేరుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యాక మొదటిసారిగా ఇంద్రవెల్లి సభ నిర్వహించగా.. ఆ సభ నుంచే ఎన్నికల శంఖారావం పూరించారు. పీఎస్సార్ ఆ సమయంలో కష్టపడ్డారనే పేరుంది. ఒకే పార్టీని నమ్ముకున్న వ్యక్తిగా తమకే గ్యారంటీగా అవకాశం ఉంటుందనే ధీమాలో ఉన్నారు. కానీ.. గడ్డం వినోద్ ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలో పదవి కోసం లాబీయింగ్ చేస్తున్నారు. ఏఐసీసీ పెద్దలను కలుస్తున్నారు. అధిష్టానం తనకే పదవి ఇచ్చే అవకాశం ఉందనే ఆశలో ఉన్నారు. ఈ క్రమంలో ఎవరికి బెర్త్ దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. మంత్రి పదవి తమ నాయకుడికే ఇవ్వాలంటూ అనుచరగణం దేవాలయాల్లో పూజలు, ప్రార్థనలు చేస్తున్నారు. తమ ఎమ్మెల్యేకే కేబినెట్‌లో చోటు కల్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నారు.

అధిష్టానం మదిలో ఎవరో?

కాంగ్రెస్ అధిష్టానం ఆశీర్వాదం లేనిదే కేబినెట్‌లో బెర్త్ దక్కదు. ఈ క్రమంలో అధిష్టానం మదిలో ఎవరున్నారనేది ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతోపాటు అందరినీ కలుపుకొనిపోతూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాల్సి ఉంది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుల, రాజకీయ సమీకరణాల కూర్పులో ఇక్కడ ప్రభావితం కానుంది. రాష్ట్ర మంత్రివర్గంలో మొత్తం 18మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం సీఎంతో కలిపి 12మంది మంత్రులు ఉన్నారు. మరో ఆరుగురికి చోటు కల్పించవచ్చు. మొదటి విడతలో హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం లేదు. ఈ క్రమంలో ఈ ప్రాంతాల నుంచి ఎంపిక చేస్తూనే ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సమీకరణ చేయాల్సి ఉంది. వీరికి అదనంగా ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి చేరుతున్న ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారంలో ఎవరికి బెర్త్ దక్కుతుందోననే స్పష్టత రావడం లేదు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందే విస్తరణ ఉంటుందని చెబుతున్నా, స్థానిక సంస్థలు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల వరకు వేచి చూడక తప్పదనే వాదనలూ ఉన్నాయి. ఈ క్రమంలో ఎవరికి మంత్రి పదవి వస్తుందోనని వేచి చూడాల్సి ఉంది. మరోవైపు ఉమ్మడి జిల్లా నుంచి మంత్రివర్గంలో చోటు దక్కితే ఈ ప్రాంత అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందనే ఆశలు ఉన్నాయి.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలు దోపిడీకి పాల్పడుతున్నాయని, బడుల్లోనే దుకాణాలు తెరిచి యూనిఫాం, బుక్స్, షూ, టైలు బహిరంగంగా విక్రయిస్తున్నాయని పేర్కొన్నారు. టీజీవీపీ ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్, కోకన్వీనర్ సతీశ్, సాయి, గణేశ్, పవర్, అఖిల్, జాదవ్ కల్యాణ్, చౌహాన్ విశాల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేందర్

క్లుప్తంగా

డాక్టర్ శిరీశ్‌కు 'వైద్య శిరోమణి'

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శిరీశ్‌కు వైద్య శిరోమణి పురస్కారం దక్కింది. మెగాసిటీ నవకళ, తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకోనున్నారు. ప్రజలకు అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం పట్ల వైద్యులతో పాటు పలువురు అభినందనలు తెలియజేశారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


రాజేందర్ (ఫైల్)

లక్ష్మణచాంద: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రాచాపూర్‌కు చెందిన రాజేందర్ (25)మంగళవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు రాత్రి 11 గంటల సమయంలో చేను వద్దకు వెళ్లి వెతకగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని తల్లి ముత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సుమలత తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంజాయి నిందితులకు కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్ ఆలం బుధవారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గంజాయి నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇప్పటికే నార్కొటింగ్ కేసులో నిందితులుగా ఉన్నారని, మరోసారి గంజాయి విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదివరకే షీట్ ఓపెన్ చేయడం జరిగిందని, తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశారని, మరోసారి గంజాయి విక్రయిస్తే బైండోవర్ డబ్బులు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. తీరు మార్చుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు సత్యనారాయణ, అశోక్, ఫణిందర్ ఉన్నారు.

గోదావరిలో మునిగి బాలుడు మృతి


నాగరాజు మృతదేహం

ఖానాపూర్: చేపలు పట్టేందుకు వెళ్లి నీటమునిగి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బావాపూర్(కే) గ్రామానికి చెందిన పడాల నాగరాజు (16) బుధవారం చేపలు పట్టేందుకు గ్రామ సమీపంలోని గోదావరినదికి వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయాడు. మృతుని తండ్రి గంగనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపాడు.

హరిత రిసార్ట్స్ ప్రైవేట్‌పరం



- 33 ఏళ్లపాటు లీజుకు..
- స్వాధీనం చేసుకున్న ప్రైవేటు సంస్థ

కడెం: కడెం హరిత రిసార్ట్స్ ఇక ప్రైవేటుపరం కానుంది. ఇంతకాలం టూరిజం సంస్థ నడిపించిన హరిత రిసార్ట్స్‌ను పర్యాటకశాఖ ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ఖానాపూర్‌కు చెందిన ఏపీపీఎస్సీ మాజీ సభ్యుడు పైడిపల్లి రవీందర్‌రావుకు చెందిన బృందావన్ లేక్‌వ్యూ రిసార్ట్స్‌కు అప్పగిస్తున్నట్లు లేఖ విడుదల చేసింది. 33 ఏళ్ల పాటు లీజుకు అప్పగిస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు.

పర్యాటకంగా అభివృద్ధి

కడెం ప్రాజెక్ట్‌ను టూరిజం స్పాట్‌గా గుర్తించిన ప్రభుత్వం 2015 మే 27న 12 ఏసీ కాటేజీలతో రిసార్ట్స్ ప్రారంభించింది. టూరిజం కార్పొరేషన్ తొమ్మిదేళ్లపాటు రిసార్ట్స్‌ను నడిపించింది. క్రమక్రమంగా ఇక్కడికి పర్యాటకుల తాకిడి పెరగడంతో రాష్ట్రంలో మంచి పర్యాటక కేంద్రంగా గుర్తింపు లభించింది. పర్యాటకులకు మంచి ఆతిథ్యం అందిస్తుండడంతో మూడేళ్లుగా బెస్ట్ రిసార్ట్స్‌గా అవార్డులు అందుకుంది.

33 ఏళ్లపాటు లీజుకు అప్పగిస్తూ నిర్ణయం

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 2012లో అప్పటి ప్రభుత్వం పర్యాటక స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. అందులో భాగంగానే ఖానాపూర్‌కు చెందిన పైడిపల్లి రవీందర్‌రావుకు టెండర్‌లో కడెం, దిండి ప్రాంతాలు దక్కాయి. 2013లో రవీందర్‌రావుకు కడెం ప్రాజెక్ట్ సమీపాన రిసార్ట్స్ ఏర్పాటుకు అగ్రిమెంట్ జరిగింది. కొంతకాలం జాప్యం జరిగిన తర్వాత పర్యాటక సంస్థనే ఇక్కడ రిసార్ట్స్ ఏర్పాటు చేసింది. తనకు అప్పగించిన స్థలం లీజు అగ్రిమెంట్ ప్రకారం తనకే దక్కాలని అప్పటి నుంచి రవీందర్‌రావు దీనిపై కోర్టు ద్వారా పోరాటం చేస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు ఈ నెల 22న కడెం హరిత రిసార్ట్స్‌ను బృందవన్ లేక్‌వ్యూ రిసార్ట్స్ ప్రైవేటు సంస్థకు అప్పగిస్తున్నట్లు పర్యాటక శాఖ లేఖ విడుదల చేసింది. బృందావన్ రిసార్ట్స్ ప్రైవేటు సంస్థ హరిత రిసార్ట్స్‌ను స్వాధీనం చేసుకుంది. మరమ్మతుల కారణంగా కొద్దిరోజుల పాటు మూసి వేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆందోళన

హరిత రిసార్ట్స్‌ను ప్రైవేటుపరం చేయవద్దని కోరుతూ బుధవారం కాంగ్రెస్ నాయకులు హరిత రిసార్ట్స్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అలెగ్జాండర్ మాట్లాడుతూ హరిత రిసార్ట్స్ ప్రైవేటు పరం కావడంతో ఇక్కడ పనిచేసిన ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతాయని, ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తే చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కడెం, ఖానాపూర్ మండలాల అధ్యక్షులు మల్లేశ్, దయానంద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని, నాయకులు వెంకటేశ్, శంకర్, దేవేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేతనాలు మహాప్రభో..!

- జీతాలు రాక ఇబ్బందుల్లో సంచార వైద్య వాహన సిబ్బంది
- ఉమ్మడి జిల్లాలో 9 వాహనాలు, 36 మంది సిబ్బంది
- వేతనాలు విడుదల చేయాలని వేడుకోలు

చెన్నూర్: పాడి సంపద పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 1962 సంచార పశు వైద్య వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం 2017లో పశువులకు వైద్య సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 100 వాహనాలు ఏర్పాటు చేసింది. అందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు 9 మంజూరు చేసింది. ఒక్కో వాహనంలో వైద్యునితో పాటు మరో ముగ్గురు సిబ్బంది పని చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 9 మంది వైద్యులు, 9 మంది డ్రైవర్లు, 9 మంది టెక్నీషియన్లు, 9 మంది అటెండర్ల చొప్పున 36 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 1962 సంచార పశు వైద్య వాహనం ద్వారా పశువులకు సకాలంలో వైద్య సేవలందడంతో గ్రామాలలో పశు మరణాలు తగ్గుముఖం పట్టాయి.


పశువుకు వైద్య సేవలందిస్తున్న వెటర్నరీ వైద్యులు

ఏడాది నుంచి బడ్జెట్ కేటాయించని ప్రభుత్వం

ప్రభుత్వం గతేడాది నుంచి 1962 వాహనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడంతో మందుల కొరత ఏర్పడింది. ఉన్న మందులతో సిబ్బంది పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. వైద్యసేవలు నిలిచిపోకుండా జీవీకే ఈఎంఆర్ఐ సంస్థ వాహనాల బాధ్యతలు చేపట్టింది. అయినప్పటికీ మందుల కొరత కొనసాగుతోంది. సిబ్బందికి సైతం వేతనాలు సకాలంలో అందడంలేదు. ప్రభుత్వం 1962 వాహనాల బలోపేతానికి నిధులు మంజూరు చేసి మందుల కొరతను నివారించాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా సిబ్బందికి సక్రమంగా వేతనాలు చెల్లించాలని 1962 వాహన సిబ్బంది కోరుతున్నారు.

సకాలంలో ఇవ్వాలి



మూడు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయడమే కాకుండా ప్రతీనెల సక్రమంగా ఇవ్వాలి.
– డాక్టర్ భవాని ఠాకూర్, మంచిర్యాల

కుటుంబ పోషణ భారం



మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. వేతనాల కోసం ప్రతీరోజు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
– ప్రకాశ్‌గౌడ్, కెప్టెన్, చెన్నూర్

విద్యార్థి సంఘాల ఆందోళన ఉద్రిక్తం

ఆదిలాబాద్: నీట్ పరీక్షలో పేపర్ లీక్ బాధ్యులను కఠినంగా శిక్షించాలని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసం వద్ద ఆందోళన నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. పలువురు నాయకులు ఎంపీ నివాసంలోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని నిలువరించడంతో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థి నాయకులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శంతన్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. నీట్ ప్రవేశ పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ ఘటన కారణంగా లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అయినప్పటికీ ప్రధాని మౌనం వహించడం సరికాదని, విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఊరుకునేదిలేదని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో నాయకులు తోట కపిల్, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలి

ఎదులాపురం: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బుధవారం అటవీ శాఖ రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ రాకేశ్ డోబ్రియాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ తరపున విడుదల చేసిందన్నారు. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే కొంత మొత్తం చెల్లించగా మరికొన్ని జిల్లాల్లో అసలుకే చెల్లించలేదన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 8 వేల మంది లబ్ధిదారులు ఉండగా 4 వేల మందికే పంపిణీ చేశారని, ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 30 శాతం మందికి మాత్రమే అందిందన్నారు. నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల లబ్ధిదారులకు ఇప్పటికీ పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి మండలంలో ఫారెస్టు ఆఫీసులో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగి తన కుటుంబసభ్యుల పేరుతో రూ.6 లక్షలు కాజేసిన విషయం ఇటీవలే వెలుగులోకి వచ్చిందని, ఈ నిధులు వెంటనే చెల్లించకపోతే దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబురావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, సహాయ కార్యదర్శి బండారు రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావు, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న టీఏజీఎస్ నాయకులు

సీఎం, మంత్రికి రుణపడి ఉంటాం

ఇంద్రవెల్లి: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న పీజీ హెచ్ఎంల జోనల్ స్థాయి సవరించిన(మోడిఫైడ్) పీపీ సర్వీస్ రూల్స్ ఫైల్‌ను ఆమోదింపజేసి ఈనెల 24న జీవో 16 విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహకరించిన మంత్రి సీతక్కకు రుణపడి ఉంటామని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావ్ అన్నారు. బుధవారం పిట్టబొంగరం ఆశ్రమ పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ భాషా పండితులు, పీఈటీల పోస్టులను ఉన్నతీకరించి పదోన్నతులు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రతినిధులు జ్ఞానేశ్వర్, రాథోడ్ వికాష్, పీజీ హెచ్ఎం ఆడే రాజేశ్వర్, సభ్యులు సుంకే చందు, రాథోడ్ సురేఖ, దుర్వ జంగు, రాథోడ్ గణేశ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

మూడు ప్రైవేట్ బస్సులు సీజ్

ఆదిలాబాద్‌రూరల్: మావల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున ఆర్టీఏ, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన మూడు ప్రైవేట్ బస్సులను సీజ్ చేసి జరిమానా విధించినట్లు ఏఎంవీఐలు మహేష్, సురేష్, హరీంద్ర కుమార్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రైవేట్ బస్సులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.


బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

వారంలోగా పాఠశాలల్లో చేరాలి

ఉట్నూర్‌రూరల్: బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి లక్కీలాటరీ ద్వారా ఎంపికైన విద్యార్థులు తమకు కేటాయించిన పాఠశాలల్లో వారంలోగా చేరాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దిలీప్‌కుమార్ సూచించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో ఎంపికైన విద్యార్థులకు పాఠశాలలను కేటాయించారు. 3వ తరగతిలో 50 మంది, 5వ తరగతిలో 25 మంది, 8వ తరగతిలో 25 మంది విద్యార్థులకు పాఠశాలలను కేటాయించారు. బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, పీఎంఆర్సీ ఆర్పీ గోవింద్‌రావు పాల్గొన్నారు.


పత్రాలు అందజేస్తున్న అధికారులు

'కుంటాల' అభివృద్ధికి కృషి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా
- జలపాతం వద్ద హరిత హోటల్ కోసం స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్, తదితరులు

నేరడిగొండ: కుంటాల జలపాతం అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ అన్నారు. మండలంలోని కుంటాల జలపాతాన్ని వారు బుధవారం సందర్శించారు. అందుబాటులో ఉన్న వసతుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు నాటిన అనంతరం హరిత హోటల్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. రూ.3 కోట్ల 81లక్షలతో హోటల్, కాటేజ్, సీసీరోడ్లతో పాటు ఇతర పనులు మంజూరు కాగా, టెండర్ సైతం పూర్తయిందన్నారు. వర్షాకాలంలో జలపాతంలో వరదనీరు అధికంగా చేరడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అడవి మధ్యలో హోటల్ నిర్మాణం చేపడతామని డీఎఫ్‌వో పేర్కొనగా, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టైగర్‌జోన్‌లో అడవి ఉన్నందున పర్యాటకులకు అసౌకర్యం కలుగుతుందన్నారు. వారి వెంట ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు, ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎఫ్ఆర్‌వో గణేశ్, ఆర్ఐ నాగోరావు, సర్వేయర్ శంకర్, ఎఫ్ఎస్‌వోలు వసంత్ కుమార్, ధన్‌సింగ్, భీంజినాయక్, ఎఫ్‌బీవో సచిన్ గ్రామస్తులు అశోక్, సోమన్న తదితరులున్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కైలాస్‌నగర్: కుంటాల పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రహదారులపై జిల్లా లెవల్ కోఆర్డినేషన్ మీటింగ్ బుధవారం నిర్వహించారు. ఆర్అండ్‌బీ, పీఆర్, ఐటీడీఏ శాఖల ద్వారా చేపడుతున్న అటవీ రహదారి నిర్మాణ అభివృద్ధి పనుల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. పెండింగ్ వివరాలు తెలుసుకున్నారు. త్వరగా ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వంతెనలు, రహదారులకు సంబంధించి త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అటవీ క్లియరెన్స్ కోసం రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, జీవకార్‌రెడ్డి, ఐటీడీఏ ఈఈ భీమ్‌రావ్, ఆర్అండ్‌బీ నర్సయ్య, సురేశ్, ఇంజనీర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్స్ క్లోజ్..!


పదో తరగతి విద్యార్థినులకు ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు గజ్జారాం



అడ్మిషన్లు పూర్తయినట్లు అతికించిన నోటీసు

- భైంసా ఆశ్రమ పాఠశాలకు డిమాండ్
- పాఠశాల గేటుకు 'నో అడ్మిషన్ బోర్డు'

భైంసాటౌన్: సాధారణంగా పేరు మోసిన ప్రైవేట్ పాఠశాలలోనో.. కార్పొరేట్ విద్యాసంస్థల్లోనో 'నో అడ్మిషన్ బోర్డులు' కనిపిస్తుంటాయి. అయితే, భైంసాలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల గేటుకు కూడా 'అడ్మిషన్స్ క్లోజ్' అన్న బోర్డు దర్శనమిస్తోంది. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉండగా, మొత్తం 675 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరం కొత్తగా 130 మంది ప్రవేశాలు పొందారు. 2021–22 విద్యా సంవత్సరంలో మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమం ప్రారంభించగా, ఈసారి పదో తరగతి విద్యార్థినుల మొదటి బ్యాచ్ ఆంగ్ల మాధ్యమంలో పూర్తి చేసుకోనున్నారు. ముధోల్ నియోజకవర్గంలోనే ఏకైక బాలికల గిరిజన ఉన్నత పాఠశాల కావడం, బాలికలను చదివించాలన్న ఆసక్తి తల్లిదండ్రుల్లో పెరగడంతో ఏటా ప్రవేశాలు పెరుగుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కాగా, పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా వసతులు లేకపోవడంతో పరిమితికి మించి అడ్మిషన్లు తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కుభీర్ మండలం మాలేగాం గ్రామానికి చెందిన తోకల భోజన్న (40)మంగళవారం రాత్రి తన భార్యకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో మందులు కొనుగోలుచేసేందుకు ద్విచక్ర వాహనంపై భైంసాకు బయలుదేరాడు. భైంసా మండలం లింగి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు భైంసా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడలో మంగళవారం రాత్రి పేకాట స్థావరంపై టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. సమాచారం రావడంతో సంఘటన స్థలానికి వెళ్లి ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.9వేల నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ వివరించారు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకుడిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని లీలానగర్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు జరిపారు. దాసరి నడిపి రాములును అరెస్టు చేసి అతని వద్ద నుంచి మట్కా చీటీలతో పాటు రూ.1,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


టేకుమట్ల శివారులో మృతి చెందిన గేదె

జైపూర్: మండలంలోని ఇందారంలో తంగళ్లపెల్లి మల్లేశ్వరికి చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. బుధవారం మేత కోసం వెళ్లిన గేదె టేకుమట్ల శివారులో మేస్తుండగా వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.85 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

క్లుప్తంగా

గ్రామ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: బోథ్ గ్రామ పంచాయతీ గ్రామసభను బుధవారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు పలు సమస్యలను లేవనెత్తారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో రాత్రి వేళల్లో ఆకతాయిలు మందు తాగి సీసాలు పగలగొడుతున్నారని ప్రధానోపాధ్యాయుడు గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పలు కాలనీల్లో మురికికాలువలు, సీసీరోడ్లు నిర్మించాలని తీర్మానించారు. వారసంతలో మంచినీటి వసతి కల్పించాలని, మరుగుదొడ్లు నిర్మించాలని వెంకటేష్ సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరిస్తామని ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రమేశ్ తెలిపారు.

నాణేల ప్రదర్శన



నాణేలు ప్రదర్శిస్తున్న రాజ్‌కుమార్

బోథ్: మండలంలోని గుర్రాలతండా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ వివిధ రకాల నాణేలు ప్రదర్శించారు. బ్రిటీషు కాలం నాటి నాణేలు, మొఘల్ కాలంలో, స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు గల నాణేలను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయురాలు సవిత, విద్యార్థులు పాల్గొన్నారు

నేడు ఇచ్చోడకు ఎమ్మెల్యే రాక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రానున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు బుధవారం ఆయన కార్యాలయంలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 32 మంది లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిభ చాటిన వారికి బహుమతి



బహుమతి అందజేస్తున్న కమిషనర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో పన్నుల వసూళ్లను పెంచే దిశగా మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నెలవారీగా పన్నులను అధికంగా వసూలు చేసే సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. గత నెలలో అత్యధిక పన్నులు వసూలు చేసిన బిల్ కలెక్టర్లు రజిత, నరేశ్‌లకు బుధవారం ప్రశంస బహుమతులు అందజేశారు.

ఇచ్చోడలో భారీ వర్షం

ఇచ్చోడ: మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు వర్షం కురవడంతో మండలకేంద్రంలోని రోడ్లపై నీరు పారింది. మండలంలో ని గాంధీనగర్, జున్ని, బోరిగామ, అడేగా మ(కె), అడేగామ(బి), కోకస్‌మన్నూర్, జామిడి, జల్దా, గేర్జం, సాథ్‌నంబర్, ఇస్లాంనగర్, దర్మంపూరి గ్రామాల్లో వర్షం కురిసింది.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం సత్కరించారు. ఉపాధ్యాయులు స్వామి, భూమన్న, అహ్మదుల్లా ఖాన్‌లను ఘనంగా శాలువాతో సన్మానించారు. నూతనంగా వచ్చిన రేణుక, మహేశ్, శ్రీకాంత్, సాయికుమార్ ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. వీడీసీ అధ్యక్షుడు నవీన్, హెచ్‌ఎం శ్రీధర్ రెడ్డి, గ్రామపెద్దలు నితిన్, గంగయ్య పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ఆర్టిస్ట్ ద్యావంత్ రమేశ్‌కు ఇటీవల నేషనల్ గోల్డ్ రైజింగ్ స్టార్ అవార్డు రాగా కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దాసరి ఆశన్నతో పాటు పలువురు బుధవారం ఆయనను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మౌర్య సురేందర్, రాము, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజం నిర్మిద్దాం

ఆదిలాబాద్‌టౌన్: మాదకద్రవ్య రహిత సమాజం నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సైన్స్, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని, వాటికి దూరంగా ఉండాలని సీఐ రమేశ్ తెలిపారు. బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అధికారులు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్‌లో సీఐ ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో రమేశ్, ఎస్సై రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, పోలీసు సిబ్బంది, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మాదక ద్రవ్యాలకు బానిసై నిండు జీవితాన్ని బలి చేసుకోవద్దని సీఐ భీమేశ్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌక్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్సై నరేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని గిన్నెర గ్రామపంచాయతీ పరిధి తోయగూడ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. గంజాయి సాగు, తరలించడం నేరమన్నారు. ఎస్సై సునీల్, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఆదిలాబాద్‌టౌన్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మండలకేంద్రంలో..

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్, ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఏఎస్సై కాత్లే భీంరావ్, కానిస్టేబుళ్లు అఫ్సర్, సిడాం ధన్ను ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: నిషేధిత పొగాకు విక్రయిస్తే చర్యలు తప్పవని, యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ అన్నారు. మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని చాందా (టి), వాన్‌వాట్ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

బజార్‌హత్నూర్: నేటి యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బోథ్ సీఐ రమేశ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంతో పాటు, దేగామలో ప్రభుత్వ కళాశాల, పాఠశాలల విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై నరేశ్, ప్యాక్స్ చైర్మన్ వెంకన్న, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, రాజారాం, రమణ, భీమేష్, నవీన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, బాపురావ్ పాల్గొన్నారు.

తలమడుగు: మాదక ద్రవ్యాలను తరిమికొడదాం, యువతను కాపాడుదాం అని తలమడుగు హెడ్ కానిస్టేబుల్ గోపాల్, హెచ్‌ఎం వెంకట్‌రావు అన్నారు. బుధవారం తలమడుగు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు వినోద్ రెడ్డి, మురళీధర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నార్నూర్: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఏఎస్సై గంగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మాదకద్రవ్యాల నిషేధిత ర్యాలీ నిర్వహించారు. అన్నాభావు సాఠే మండలాధ్యక్షుడు మహేందర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఫెరోజ్ ఖాన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: యువత డ్రగ్స్‌కు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తు కోల్పోవద్దని ఉట్నూర్ సీఐ మొగిలి సూచించారు. బుధవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన, ర్యాలీ కార్యక్రమంలో భాగంగా ఉట్నూర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.



ఉట్నూర్‌రూరల్‌లో..



బోథ్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఇంద్రవెల్లి: తోయగూడలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లక్ష్మణ్, అధ్యాపకులు శ్రీలత, గణేశ్, తిరుపతి, వినోద్, కేశవులు, సువర్ణ, శ్రీనివాసరావు, కిషోర్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: వాన్‌వాట్ గ్రామంలో..



బజార్‌హత్నూర్: ర్యాలీలో పాల్గొన్న సీఐ రమేశ్



తలమడుగు: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



నార్నూర్: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మొక్కలు నాటేందుకు అనువైన ప్రదేశం గుర్తించాలి

తలమడుగు: గ్రామాల్లో త్వరలో హరితహారం మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలు గుర్తించి గుంతలు తవ్వాలని ఎంపీడీవో శేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని బరంపూర్ గ్రామంలో గ్రామ సమీపంలోని వేంకటేశ్వర ఆలయం కొండ కింద హరితహారంలో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అన్ని గ్రామాల్లో వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటాలన్నారు. ఏపీవో మోగమాల, ప్రవీణ్ స్వామి, గ్రామస్తులు కేదారేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నేరడిగొండ: మండలంలో బుగ్గారం(బి), వడూర్ గ్రామాల్లో నూతనంగా ఏర్పాటైన మీసేవా కేంద్రాలను నడిపే నిర్వాహకుల నుంచి బుధవారం ఐకేపీ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. బుగ్గారం(బి)లో జాదవ్ సోనిని నియమించగా, వడూర్‌లో అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో ఎంపిక వాయిదా వేశామని ఐకేపీ సభ్యులు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



బోథ్‌లో బంద్ చేస్తున్న ఏబీవీపీ నాయకులు

బోథ్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. మండల వ్యాప్తంగా గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆకాశ్ మట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. సుకుమార్, కార్తీక్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం మండల నాయకులు పాఠశాలలను బంద్ చేయించారు. నాయకులు ప్రదీప్, మనిదీప్, శ్రీనివాస్, శంకర్, సుందర్ సింగ్, శ్రీకార్, సాయి చరణ్, పోతన్న, మహేష్, సన్నీ, రాహుల్, మనిప్రసాద్, ఆకేష్, రాంసింగ్ పాల్గొన్నారు.

త్వరలోనే తులం బంగారం



సిరికొండ: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే



భీంపూర్‌లో చెక్కులు అందజేస్తున్న అనిల్ జాదవ్

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

సిరికొండ: త్వరలోనే కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా తులం బంగారం కూడా అందజేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు కొండపూర్ శివారులోని పురాతన శివాలయ దారికోసం రూ.4లక్షలతో మొరం రోడ్డు మంజూరు చేసి భూమిపూజ చేశారు. తహసీల్దార్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్ నాయకులు ఉన్నారు.

పరామర్శ

ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన మండల కేంద్రానికి చెందిన జవాను సూర్యవంశీ రాజేందర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పరామర్శించారు. జవాను చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

భీంపూర్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్..

తాంసి: తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. తాంసి మండలంలో 10 మందికి, భీంపూర్ మండలంలో 30మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, తహసీల్దార్‌లు లక్ష్మి, సత్యనారాయణ, ఎంపీడీవోలు మోహన్ రెడ్డి, గోపాలకృష్ణ రెడ్డి, ఆర్‌ఐలు అశోక్, మహేందర్, నాయకులు ఉన్నారు.

రోడ్డు కోసం బీజేపీ ఆందోళన

నార్నూర్: హస్నాపూర్ చౌరస్తా నుంచి నార్నూర్, గాదిగూడ మీదుగా ఎల్లాపూర్ వరకు డబుల్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బీజేపీ జిల్లా నాయకుడు రాథోడ్ బిక్షపతి మాట్లాడుతూ హస్నాపూర్ చౌరస్తా నుంచి నార్నూర్, గాదిగూడ, ఎల్లాపూర్ వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. గతంలో నిధులు మంజూరైనా సగం వరకు పనులు చేపట్టకుండా వదిలేశారని ఆరోపించారు. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదన్నారు. ఏఎస్సై గంగారెడ్డి అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ అమత్ లాల్ ఆందోళనకారులకు నచ్చజెప్పారు. రోడ్డు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాలుకర్ ప్రకాశ్, పార్టీ మండల అధ్యక్షుడు తొడసం బండు, ఇతర నాయకులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

'డీవీ కృష్ణ స్ఫూర్తితో విప్లవోద్యమాన్ని నిర్మిద్దాం'

ఎదులాపురం: విప్లవోద్యమ నాయకుడు, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ అన్న స్ఫూర్తితో బలమైన విప్లవోద్యమాన్ని నిర్మిద్దామని సీపీఐ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా నాయకులు అన్నారు. డీవీ కృష్ణ ద్వితీయ వర్ధంతి పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లాలో బుధవారం స్తూప ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించగా, ఉమ్మడి జిల్లా నుంచి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు. కామ్రేడ్ డీవీ కృష్ణ స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా నాయకులు మాట్లాడుతూ తొలితరం విప్లవోద్యమ నాయకుల్లో డీవీ కృష్ణ ఒకరని గుర్తు చేశారు. నేటి తరం కమ్యూనిస్టు విప్లవకారులకు ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉద్యమాలు నిర్మించి సమస్యలను సాధించుకోవాలన్నారు. ఇందులో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, నాయకులు రాజన్న, రామ్‌లక్ష్మణ్, గంగన్న, బక్కన్న, జగన్‌సింగ్, లక్ష్మి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా నాయకులు

గ్రామాలకు చేరని 'పల్లెవెలుగు'

- రోడ్డున్నా తిరగని బస్సులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

బోథ్: మండలంలోని అనేక పల్లెలకు బస్సు సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు నడవకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆర్థికంగా భారం పడుతుండడంతోపాటు ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నట్లు వారు వాపోతున్నారు. మండలంలోని బోథ్ నుంచి పొచ్చర, కనుగుట్ట, కౌఠ, సొకెర, సొనాల, నాగాపూర్, ఘన్‌పూర్, ధన్నూర్, కుచులాపూర్ గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. ఈ గ్రామాలు ప్రధాన రహదారికి దగ్గరగా ఉండటంతో బస్సు అందుబాటులో ఉంటుంది. కానీ మిగిలిన గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు.

రోడ్డున్నా బస్సులు లేవు..

మండలంలోని కుచులాపూర్ మీదుగా ధన్నూర్ వరకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. ఆ రూట్‌లో ఉన్న ధన్నూర్ కె, బిర్లగొంది, మందబొగడ, కుచ్చిర్యాల్, ఖండిపల్లె, అందూర్, రఘునాథ్‌పూర్, నా రాయణపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. నేరుగా రఘునాథ్‌పూర్, నారాయణపూర్ గ్రామాలకు రోడ్డున్నా బస్సు మాత్రం వెళ్లడం లేదు. మరోవైపు మర్లపెల్లి గ్రామం వైపు దాదాపు 19 గ్రామాలున్నాయి. బోథ్ నుంచి మర్లపెల్లి మీదుగా నిగిని వరకు ఇంతకు ముందు బస్సు నడిచేది. కానీ ప్రస్తుతం బస్సు నడవడం లేదు. రోడ్డున్నా తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా సొనాల నుంచి చింతలబోరి మీదుగా వజ్జర్ వరకు 10 గ్రామాలు ఉన్నాయి. రోడ్డు సౌకర్యం కూడా ఉంది. కానీ బస్సు మాత్రం నడవడం లేదు. దీంతో తాము ఆటోలు, జీపుల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు భయాందోళన చెందుతున్నారు.



ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న ప్రయాణికులు

బస్సు సౌకర్యం కల్పించాలి



రోడ్డున్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి. బస్సు లేకపోవడంతో ఎక్కువ చార్జీలతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణం కూడా ప్రమాదకరంగా మారింది. ఆర్టీసీ అధికారులు వెంటనే గ్రామాలకు బస్సులు నడిపించాలి.

– తుకారాం, మర్లపెల్లి

విద్యార్థులకు ఇబ్బందులు..

దాదాపు 30 గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల కేంద్రానికి విద్యను అభ్యసించడానికి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఆటోల్లో, జీపుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణ ఖర్చులు భరించలేని కొంత మంది విద్యార్థులు చదవలేని పరిస్థితి నెలకొంటుంది. బస్సు ఉంటే బస్సు పాస్ ద్వారా తక్కువ ఖర్చుతో మండల కేంద్రానికి చేరుకొనే అవకాశం ఉంటుంది. వెంటనే మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ

కైలాస్‌నగర్: పట్టణంలోని న్యూ హౌసింగ్‌బోర్డు పరిధి ఆదిత్యనగర్ కాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సమస్య కలెక్టర్ రాజర్షి షా చొరవతో త్వరలోనే తీరనుంది. కొన్నేళ్లుగా అద్దె భవనంలోని ఇరుకు గదుల్లో పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన కలెక్టర్ ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల భవన నిర్మాణాల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద రూ.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో పాఠశాల భవన నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ బుధవారం భూమిపూజ చేశారు. అధికారులు, కాలనీవాసులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఏఈ అరుణ్, హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయురాలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కమిషనర్ ఖమర్ అహ్మద్

ఢిల్లీకి బయల్దేరిన యువజన కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో చేపట్టనున్న పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి బుధవారం ఉమ్మడి జిల్లా నాయకులు తరలివెళ్లారు. ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతారెడ్డి, ఆసిఫాబాద్ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్, నైతం ప్రభాకర్ బయల్దేరి వెళ్లారు.